క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం



సూపరింటెండెంట్ వెంకటరమణకు చెక్కు అందజేస్తున్న నండూరి రామకృష్ణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన నండూరి రామకృష్ణ స్వామి అనే దాత రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయన సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు తొలగింపు



కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

పరవాడ: మండలంలో కురిసిన వర్షానికి వెన్నెలపాలెంలో కూలిన చెట్లను గ్రామ ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు ఆధ్వర్యంలో ఆదివారం తొలగించారు. భారీ వర్షానికి వెన్నెలపాలెం గ్రామానికి వెళ్లే రహదారిలో భారీ వృక్షం శనివారం అర్ధరాత్రి కూలిపోయింది. ఫలితంగా గ్రామానికి రాకపోకలు స్తంభించిపోవడంతో ప్రజలు రెండు రోజులుగా పడరాని పాట్లు పడుతున్నారు. చెట్టును తొలగించడానికి అధికారులు కనీస చర్యలు చేపట్టని కారణంగా గ్రామ ఉప సర్పంచ్ సన్యాసిరావు ముందుకు వచ్చి సొంత ఖర్చులతో కూలిన చెట్టును తొలగించారు. దీంతో ప్రజల రాకపోకలకు వీలు కలిగింది. ప్రజల ఇబ్బందులను గుర్తించి చెట్టును తొలగించడానికి ముందుకు వచ్చిన ఉప సర్పంచ్‌కు ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయం కోసం పూజలు



కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

మల్కాపురం: పేదల గుండెల్లో గుడి కట్టుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, విశాఖ పశ్చిమలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ విజయం సాధించాలని కోరుతూ జింక్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జింక్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ గంట్యాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. నిరుపేదల ఇళ్లలో వెలుగులు నింపి వారి ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించిన మహానుభావుడు జగన్ అని కొనియాడారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్‌కుమార్ తక్కువ సమయంలో రూ. 220 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేసి చూపించారన్నారు. అలాంటి నాయకుడు వెంట పశ్చిమ ప్రజలు నిలిచారని, ఆయన భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జిమ్‌లో చిన్నారుల సందడి



తెన్నేటి పార్కులో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాల వద్ద పిల్లల సందడి

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం తెన్నేటి పార్కులో వీఎంఆర్‌డీఏ అధికారులు పిల్లల కోసం ప్రత్యేకంగా ఇటీవల జిమ్ ఏర్పాటు చేశారు. పిల్లల సౌకర్యార్థం జిమ్ పరికరాలు అందుబాటులో ఉంచింది. తెన్నేటి పార్కు సందర్శనకు వెళ్తున్న చిన్నారులు ఈ జిమ్ పరికరాల వద్ద సాధన చూస్తూ సందడి చేస్తున్నారు. పిల్లలు తమ ఎత్తును బట్టి వారికి అనుకూలంగా ఉండే పరికరాలను వినియోగించుకుంటున్నారు.

ఆ దారిలో ప్రయాణం..
భయం భయం

- వాడచీపురుపల్లి–ఎన్టీపీసీ రహదారిలో కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న వాహన చోదకులు, పాదచారులు

పరవాడ: వాడచీపురుపల్లి–ఎన్టీపీసీ రహదారిలో పొంచి ఉన్న ప్రమాదంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం గత ఇరవై ఏళ్ల క్రితం వాడచీపురుపల్లి నుంచి ఊటగెడ్డ కూడలి వరకు రోడ్డుకు ఇరువైపుల నాటిన వృక్షాలు నేడు రహదారి ప్రయాణికుల పాలిట శాపాలుగా మారాయి. రోడ్డుకు ఇరువైపుల నాటిన చెట్లు ప్రస్తుతం ఎండిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఎండిన చెట్లను తొలగించడంలో అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. ఈ రహదారిలో నిత్యం ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, కూలీలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే భారీ వాహనాలు కూడా ప్రయాణిస్తుంటాయి. గత కొన్నేళ్ల నుంచి రహదారిలో అనేక చెట్లు ఎండిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆ చెట్లు ఏ క్షణంలో కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎండిపోయిన చెట్లు వర్షాకాలంలో నాని ఎప్పుడు కూలిపోతాయోనని వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, తంతడి గ్రామాలకు చెందిన కార్మికులు,



ఎన్టీపీసీ రహదారిలో కూలే స్థితిలో ఉన్న ఎండిపోయిన చెట్లు

ప్రయాణికులు భయపడుతున్నారు. ప్రమాదం ముంచుకు రాక ముందే ఎండిన చెట్లను తొలగించడానికి ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎండిన చెట్లతో భయాందోళనలు

వాడచీపురుపల్లి నుంచి ఎన్టీపీసీ రహదారిలో అనేక చెట్లు ఎండిపోయి ఉన్నాయి. ఎండకు ఎండి వానకు తడిసి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఈ రోడ్డులో ప్రయాణిస్తున్న సమయంలో చెట్లు ఎప్పుడు కూలిపోతాయోనని భయమేస్తోంది.

– గుండా చిననాగేశ్వరరావు

ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు చేపట్టాలి

ఎన్టీపీసీ రహదారిలో ప్రయాణికులను భయపెడుతున్న ఎండిన చెట్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. ఎన్టీపీసీ అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రహదారిలో ఎన్టీపీసీ ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికులకు శాపంగా మారిన ఈ చెట్లను తక్షణమే తొలగించాలి.

– కె.కృష్ణంనాయుడు, గంగునాయుడుపాలెం

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ చేస్తున్న అర్చకుడు



నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనని వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

అమర వీరుల త్యాగ ఫలితమే తెలంగాణ



వేడుకలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ వీరేశం, అతిథులు

ఉక్కునగరం: అమర వీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎన్.వీరేశం అన్నారు. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కు అధికారుల సంఘం (సి) భవన్‌లో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎన్.కుమారస్వామి, ప్రధానకార్యదర్శి జి.ఆనంద్, అధికారులు వేణుగోపాల్, బి.బాలాజి, చంద్రమౌళి, ఆర్.నరసింహ, జి.మల్లేశం, అసోసియేషన్ ప్రతినిధులు జె. శ్రావణ్‌కుమార్, ఎస్.బాలరామ్, ఎన్.నర్సింగరావు, సీహెచ్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పర్యావరణ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ పర్యావరణ, స్పోర్ట్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్‌ర్యాలీని ఉక్కునగరం త్రిష్టా మైదానంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం స్టీల్‌ప్లాంట్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. లక్షలాది మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సైకిల్ ర్యాలీ ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా తిరిగి త్రిష్టా మైదానానికి చేరుకుంది. బాలబాలికలు పర్యావరణ ఆవశ్యకతను తెలియజేసే ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కథలతో విజ్ఞాన సముపార్జన

పెదగంట్యాడ: కథలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చని స్థానిక ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు కథల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాల్లో కథలు చదివితే వాటిలోని నీతి అర్థమవుతుందని, మన నడవడిక బాగుంటుందని చెప్పారు.అనంతరం ఆటలు ఆడించారు గ్రంథాలయాధికారి పి.వి. రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 13 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్‌కు చర్యలు

- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కృషి
- ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి
- ఎన్ఏడీలో పోలీసుల లాంగ్ మార్చ్

గోపాలపట్నం: విశాఖలో కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఎన్ఏడీ కూడలి, బుచ్చిరాజుపాలెం, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు పోలీసులు, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు కౌంటింగ్ సమయంలో అల్లర్లు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టామన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు లాంగ్ మార్చ్ నిర్వహించామన్నారు. శాంతిభద్రతలు కాపాడేందుకు కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రజలు పుకార్లను నమ్మవద్దని సూచించారు. అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. బాణసంచా కాల్చడం,



ఎన్ఏడీ జంక్షన్‌లో లాంగ్ మార్చ్ చేస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, వెస్ట్ సబ్ డివిజన్ పోలీసులు

సమావేశాలు నిర్వహించడం వంటికి చేయరాదని సూచించారు. మోడల్ కాండక్ట్ కోడ్ ఈ నెల 6వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఆ తరువాత సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతులు కోరవచ్చన్నారు.

వెస్ట్ సబ్ డివిజన్‌లో 500 మందిపై బైండోవర్

కౌంటింగ్ నేపథ్యంలో రౌడీషీటర్లు, అనుమానితుల్ని సుమారు 500 మందిని బైండోవర్ చేశామని ఏసీపీ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో వార్డు స్థాయి, డివిజన్ స్థాయి నాయకుల్ని కూడా బైండోవర్ చేశామన్నారు. వీరిలో అన్ని పార్టీల నాయకులు కూడా ఉన్నారని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.5 లక్షలు బాండ్ తీసుకున్నామన్నారు. చట్టాన్ని అందరూ గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గీత సహ కులాల నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా చెల్లుబోయిన నాయుడు



అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు, నూతన కార్యవర్గ సభ్యులు

పెదగంట్యాడ: పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంఘం అధ్యక్షుడిగా చెల్లుబోయిన నాయుడు ఎన్నికయ్యారు. పెదగంట్యాడలోని సంఘం కార్యాలయంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా నెల్లి సాధూరావు, ప్రధాన కార్యదర్శిగా వనుము నాగేశ్వరరావు, కోశాధికారిగా యలమంచిలి మంగరాజు, కార్య నిర్వాహణ అధ్యక్షుడిగా పితాని భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా దుంగ దేవన్‌రాజు, సిరట్ల వాసు, కార్యదర్శులుగా వనుము హనుమంతురావు, అండిబోయిన సన్యాసిరావు, సభ్యులుగా 30 మందిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత సహకులాల వారంతా ఐక్యంగా ఉండాలని కోరారు. తద్వారా సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రగతి సాధించాలని పిలుపునిచ్చారు. గాజువాక నియోజకవర్గంలో వేల సంఖ్యలో తమ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నారని, వారంతా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. గీత సహకులాల వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అల్లర్లు చేస్తే కఠిన చర్యలు



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర



ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ రాజు

సీతమ్మధార: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ప్రత్యేక నిఘా ఉంటుందని, రౌడీషీటర్లు హద్దు మీరకుండా ఉండాలని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఏఎస్ఐ రాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా ఉండాలన్నారు.

పోలీసుల వలయంలో ఏయూ ప్రాంగణం

ఏయూ క్యాంపస్: పోలీసుల వలయంలోకి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వెళ్లింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రక్రియ మొత్తం ఇక్కడే జరుగుతోంది. మరి కొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో భద్రతతను మరింత కట్టుదిట్టం చేశారు. ఒక వైపు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు.. మరో వైపు భద్రతాపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలల ప్రాంగణంలోకి వచ్చే ప్రతి వ్యక్తిని గుర్తింపు కార్డులు తనిఖీ చేసి లోపలికి పంపుతున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ప్రాంగణం మొత్తం పోలీసుల నిఘాలో ఉండనుంది.

నవ్వులు పంచిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్ల కార్యక్రమం నవ్వులు పంచింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. సినిమా షూటింగ్, దోమ తెర, ఎస్ఐ గారికి ఫోన్, మినిస్టర్ మర్యాద, నెక్లెస్, ఇంద్రధనస్సు చీర, పేపర్ బాయ్, జాతకాలు, వాడితో మాట్లాడకు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, నాగగణేష్ అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ముందుగా నాట్య గురువు ఎస్.శైలజ శిష్య బృందం అక్షిత, నికేతని, ఐశ్వర్య, మంజుల చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న మస్తానప్ప, పిట్టారెడ్డి, ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి కోరారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించిన 1207వ రోజు దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. సెయిల్‌లో విలీనం చేయడంతో పాటు సొంత గనులు కేటాయించడం ద్వారా విశాఖ ఉక్కు పూర్వ వైభవానికి సహకరించాలన్నారు. తెలుగు ప్రజల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం అంత సులభమైన విషయం కాదని గ్రహిస్తే మంచిదన్నారు. నాయకులు డి.ఆదినారాయణ, ఎన్నేటి రమణ, నంది తాతారావు, భీమారావు, కటికల కల్పన, ఎస్.చంద్రశేఖర్ తదతరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి నృత్య శిక్షణ శిబిరం



శిబిరంలో నృత్యం నేర్చుకున్న చిన్నారులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ రెవెన్యూ పార్కులో నెల రోజుల పాటు జరిగిన వేసవి నృత్య శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. చందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అకాడమీ నృత్యకారులు సుమారు 100 మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

తెన్నేటి పార్కుకు మహర్దశ

- ఆధునికీకరణ పనులతో కొత్త శోభ
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం తెన్నేటి పార్కుకు మహర్దశ పట్టింది. శిథిలావస్థలో ఉన్న పార్కు రూపురేఖలు ఆధునికీకరణ పనులతో మారుతున్నాయి. కైలాసగిరి దిగువన బీచ్ రోడ్డును ఆనుకుని తెన్నేటి పార్కు సందర్శకులకు అందుబాటులో ఉంది. కైలాసగిరికి వెళ్లే సందర్శకులు ఈ పార్కుకు కూడా వెళ్తుంటారు. తీరం చెంతన పార్కు ఉండడంతో ప్రజలు ఎక్కువ సమయం గడుపుతుంటారు. ప్రస్తుతం పార్కు శిథిలావస్థకు చేరింది. రెయిలింగ్, ఫుట్‌పాత్‌లు పాడైపోయాయి. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారులు పార్కు ఆధునికీకరణపై దృష్టి సారించారు. దీంతో రూపురేఖలు మారుతున్నాయి. సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతున్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నారు. సందర్శకుల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు. శుద్ధి చేసిన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో పచ్చదనం కోసం లేన్‌లు అమర్చుతున్నారు. రెయిలింగ్ ఏర్పాటు చేసి రంగులు వేస్తున్నారు. సందర్శకులు కూర్చోవడానికి వీలుగా సిమెంట్ దిమ్మలు, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వాటిపై కూర్చుని సందర్శకులు సముద్రం అలలను తిలకించవచ్చు. ప్రధాన ముఖ ద్వారానికి మెరుగులు దిద్ది కొత్తదనం తీసుకువచ్చారు. కొద్ది రోజుల కిందట చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకుని ప్రజలకు కొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది.



పార్కులో సిమెంట్ బెంచీలు, రెయిలింగ్



రంగులు వేసిన తెన్నేటి పార్కు ముఖ ద్వారం